

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా సంజీవ రెడ్డి

- బండి ఆశీస్సులతో దక్కిన పదవి



పెద్దపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా సీనియర్ నాయకుడు కర్రె సంజీవరెడ్డిని ఆ పార్టీ నియమించింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆశీస్సులతో సంజీవ రెడ్డిని జిల్లా అధ్యక్ష పదవి వరించిందని తెలుస్తోంది. ఓదెల మండలం కొలనూర్ గ్రామానికి చెందిన ఆయన 1988 నుంచి ఏబీవీపీ కార్యకర్తగా పని చేశారు. 1990లో బీజేపీలో చేరి గ్రామ శాఖ ఉపాధ్యక్షుడిగా పని చేశారు. 1992 నుంచి 2001 వరకు రెండుసార్లు మండల ఉపాధ్యక్షుడిగా, రెండుసార్లు అధ్యక్షుడిగా పని చేశారు. 2001, 2014లో రెండు పర్యాయాలు ఓదెల జడ్పీటీసీగా పోటీ చేశారు. 2001 నుంచి 2008 వరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. 2017 నుంచి పెద్దపల్లి జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. సంజీవరెడ్డి సేవలను పార్టీ గుర్తించింది. మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణా రెడ్డి అనుచరుడు అయిన సంజీవ రెడ్డి ఏడాది కాలంగా కరీంనగర్ జిల్లా రాజకీయాల్లో చురుగ్గా పాల్గొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో సంజయ్ విజయం కోసం సంజీవరెడ్డి శ్రమించారు. పార్టీ జిల్లా అధ్యక్ష పదవి కోసం శిలారపు పర్వతాలు, సోమారపు లావణ్య, ప్రస్తుత అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్ రెడ్డి, మేకల శ్రీనివాస్ యాదవ్, గొట్టిముక్కుల సురేష్‌రెడ్డి ప్రయత్నించినప్పటికీ సంజీవరెడ్డికి జిల్లా అధ్యక్ష పదవి దక్కింది.

ప్రాజెక్టులు లేక వృథాగా నీరు



- ఈ ఏడాది కూడా శ్రీపాద నుంచి 278 టీఎంసీలు
- ప్రాజెక్టులోకి వచ్చిన 331 టీఎంసీల వరద
- వేసవిలో నీటి కొరత లేకుండా పత్తిపాక చేపట్టాలి
- తుమ్మిడి హెట్టి బ్యారేజీ నిర్మించాలి
- అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు అందుబాటులోకి తేవాలి

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఈ ఏడాది కూడా 278 టీఎంసీల అదనపు జలాలు గోదావరిలోకి వృథాగా పోయాయి. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ఉండేందుకు పత్తిపాక రిజర్వాయర్, తుమ్మడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించి కాళేశ్వరం ప్రాజెక్టు అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను అందుబాటులోకి తీసుకరావాలి. ఐదేళ్ల నుంచి ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వస్తున్నది. ఇక్కడి నుంచి నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా మిడ్ మానేరు రిజర్వాయర్‌లోకి నీటిని ఎత్తిపోయగా 278 టీఎంసీల నీటిని గోదావరిలోకి గేట్ల ద్వారా వదిలి పెట్టారు.

గోదావరి నదీ జలాలను సద్విని యోగం చేసుకునేందుకు అంతర్గాం మండలం ఎల్లంపల్లి వద్ద గోదావరి నదిపై 20.175 టీఎంసీల సామర్థ్యంతో శ్రీ పాద ఎల్లంపల్లి ప్రాజెక్టును నిర్మించిన విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్టును ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టగా తెలంగాణ వచ్చిన తర్వాత 2017లో పూర్తయ్యింది. ఈ ప్రాజెక్టు ద్వారా 2 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందించడంతో పాటు ఎన్టీపీసీకి, హైదరాబాద్ ప్రజల తాగునీటి అవసరాలకు నీళ్ల ఇచ్చేందుకు దీనిని నిర్మించారు. అలాగే ప్రాణహిత-చేవేళ్ల ప్రాజెక్టులో భాగంగా ఈ ప్రాజెక్టుకు ప్రాణహిత నది ద్వారా గ్రావిటీ ద్వారా నీళ్లను తీసుక వచ్చి చేవేళ్ల వరకు ఎత్తి పోసేందుకు దీనిని వాడుకునేలా ప్రణాళికను రూపొందించారు.

తెలంగాణ వచ్చిన తర్వాత ప్రాణహిత- చేవేళ్ల ప్రాజెక్టుకు రీ డిజైన్ చేశారు. తుమ్మడి హెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణం చేపట్టకుండా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వద్ద మూడు బ్యారేజీలు నిర్మించి రివర్స్ ఎత్తిపోతల ద్వారా శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో పోయాలని నిర్ణయించారు. ఆ మేరకు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ పనులను శరవేగంగా చేపట్టి 2020లో మూడు బ్యారేజీలు, పంప్‌హౌస్‌లను పూర్తి చేశారు. అదే ఏడాది ప్రాజెక్టును ఆరంభించి జాతికి అంకితం చేశారు. అప్పటి నుంచి గత ఏడాది మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్ కుంగి పోయే నాటికి కేవలం 163 టీఎంసీల నీటిని మాత్రమే దిగువ నుంచి శ్రీపాద ఎల్లంపల్లిలోకి ఎత్తిపోశారు.

కానీ శ్రీపాద నుంచి గడిచిన నాలుగేళ్లలో 2019-20 లో 63 టీఎంసీలు, 2020-21లో 183 టీఎంసీలు, 2021-22లో 471 టీఎంసీలు, 2022-23లో 400 టీఎంసీలు, 2023-24లో, ఈ ఏడాది 278 టీఎంసీల నీటిని గోదావరిలోకి వదిలి పెట్టారు. గత ఏడాది జూన్ 1వ తేదీ నుంచి ప్రాజెక్టులోకి క్యాచ్‌మెంట్ ఏరియా, ఎస్సారెస్పీ, కడెం ప్రాజెక్టుల నుంచి మొత్తం 330.011 టీఎంసీల వరద నీరు వచ్చింది. ఇందులో నంది పంప్‌హౌస్ ద్వారా గాయత్రి మిడ్ మానేరుకు కాళేశ్వరం నీళ్ల అవసరం లేకుండా 24.193 టీఎంసీల నీటిని ఎత్తిపోశారు. 278 టీఎంసీల నీటిని దిగువకు వదిలి పెట్టారు. 13 టీఎంసీల నీటిని సాగు, తాగు, పరిశ్రమల అవసరాలకు వాడుకున్నారు. ప్రస్తుతం 15.75 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ఈ నీటిని జాగ్రత్తగా వాడుకోవాల్సి ఉంటుంది. మళ్లీ వర్షాలు కురిసే వరకు పొదుపు పాటించాల్సి ఉంటుంది. వర్షాలు కురిసి వరదలు వచ్చేటప్పుడు అవసరం మేరకే ఇక్కడి నుంచి మిడ్ మానేరుకు నీటిని తరలిస్తున్నారు. మిడ్ మానేరు,

మిగతా 8వ పేజీలో

మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించిన కలెక్టర్



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రంగంపల్లిలోని మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌ను సోమవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష సందర్శించారు. వసతులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. 10గ్రేడ్ విద్యార్థులతో ఇంటరాక్ట్ అయ్యారు. 40మంది విద్యార్థులు 9ప్లెస్ జీపీఏ కంటే ఎక్కువ గ్రేడ్‌లను పొందాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మెడిసిన్ అండ్ సోర్స్ ఆఫ్ మెడిసిన్ గురించి అడిగి తెలుసుకున్నారు. స్టోర్ వస్తువులను తనిఖీ చేశారు. వంటగది సిబ్బందిని విచారించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఆంజనేయస్వామి విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఆంజనేయస్వామి విగ్రహానికి సోమవారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, మనాలీ ఠాకూర్ దంపతులు శంకుస్థాపన చేశారు. రామగుండం బీ పవర్‌హౌస్ వద్ద ఉన్న గుట్టపై ఈ విగ్రహాన్ని నెలకొల్పనున్నారు. 108అడుగుల ఎత్తు గల భారీ విగ్రహం రూ.8కోట్ల అంచనాలతో నిర్మిస్తున్నట్టు ఎమ్మెల్యే చెప్పారు. రాముడు నడిచిన నేల అయిన రామునిగుండాలను అభివృద్ధి చేస్తానని, ఆధ్యాత్మిక కేంద్రంగా నెలకొల్పుతానన్నారు. 1800సంవత్సరాలు నాటి పురాతన ఆంజనేయ విగ్రహం రామగుండం గుట్టపై బయట పడిందని, దీనిని పర్యాటక కేంద్రంగా, ఆహ్లాదంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని చెప్పారు. నాయకులు మహంకాళి స్వామి, మారెల్లి రాజిరెడ్డి, ధార్మిక సంస్థల నాయకులు అయోధ్య రవీందర్, బల్మూరి అమరేందర్‌రావు, ప్రజలు పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి ఆలయానికి భూమిపూజ



ఆలయానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు

ఎలిగేడు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మల్లికార్జునస్వామి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. శివపల్లిలో సోమవారం మల్లికార్జునస్వామి ఆలయానికి సతీసమేతంగా శిలాన్యాసం, భూమిపూజ చేశారు. ఆయన ఆలయకమిటీ, గ్రామస్థులను ఉద్దేశించి మాట్లాడారు. భగవంతుని ఆశీస్సులతో పాడిపంటలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలన్నారు. ఆలయ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందించిన రామగుండం సీపీ



క్రీడాకారులను అభినందిస్తున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో ఐదు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో కాళేశ్వరం జోన్ రాష్ట్ర స్థాయిలో 3వ స్థానంలో నిలిచిందని రామగుండం సీపీ శ్రీనివాస్ చెప్పారు. సోమవారం రాత్రి కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన క్రీడాకారుల అభినందన సభలో మాట్లాడారు. కాళేశ్వరం జోన్ తరపున రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు. ఇదే స్ఫూర్తితో జాతీయ స్థాయిలో రాణించి కాళేశ్వరం జోన్, రామగుండం కమిషనరేట్‌కు పేరు తీసుకురావాలని సూచించారు. రామగుండం కమిషనరేట్‌కు 11గోల్డ్‌మెడల్, 15సిల్వర్ మెడల్స్, 21బ్రాంజ్ మెడల్స్, ములుగు జిల్లాకు 3గోల్డ్‌మెడల్స్, 5 సిల్వర్, 5 బ్రాంజ్ మెడల్స్, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాకు 1 గోల్డ్‌మెడల్, 3 సిల్వర్ మెడల్స్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా 1 గోల్డ్ మెడల్, 4సిల్వర్ మెడల్స్, 3 బ్రాంజ్‌మెడల్స్ సాధించడంపై అభినందించారు. అదనపు డీసీపీ(అడ్మిన్) రాజు, స్పెషల్‌బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, ఇన్‌స్పెక్టర్లు అజయ్‌బాబు, కృష్ణ, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు దామోదర్, మల్లేషం, సంపత్ పాల్గొన్నారు.

పాఠశాలకు మినరల్‌వాటర్ ప్లాంట్ వితరణ

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఉషన్నపల్లి ప్రాథమిక పాఠశాలకు చైతన్యస్పందన స్వచ్ఛందసంస్థ గ్రామానికి చెందిన మంద శ్రీనాథ్ ప్రోత్సాహంతో మినరల్ వాటర్ ప్లాంట్‌ను అందజేశారు. ఎంఈవో సిరిమల్లె మహేష్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయులు సమ్మయ్య, ఉపాధ్యాయులు, అనిల్, మధూకర్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

పెద్దపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేస్తామని ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. సోమవారం పెద్దపల్లి పట్టణానికి వచ్చిన కవిత తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ ఇది అబద్ధాల మోసపూరిత ప్రభుత్వమని, జనవరి 26న రాత్రే టింగు టింగు మంటూ రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తామన్న ముఖ్యమంత్రి వేయలేదని, మహిళలకు రూ.2500 ఇవ్వలేదన్నారు. సింగరేణి కార్మికుల మారు పేర్లు మార్చలేదని, ఇప్పుడు ఇందిరమ్మ, రేపు రాజీవ్‌గాంధీ, ఆ తర్వాత సోనియాగాంధీ పేరిట దరఖాస్తులు తీసుకునుడే తప్ప చేసేదేమి ఉండదని మండిపడ్డారు.

తెలంగాణ రావడం వల్లనే పెద్దపల్లి జిల్లా ఏర్పాటైందని, రామగుండంలో రూ.500 కోట్లతో మెడికల్ కళాశాల ఏర్పాటైందన్నారు. సింగరేణి కార్మికుల సంక్షేమానికి కేసీఆర్ ఎన్నో చేశారని, 13 వేల మందికి డిపెండెంట్ ఉద్యోగాలు ఇప్పించారని గుర్తు చేశారు. సింగరేణి కార్మికుల మారుపేర్లు మార్చలేదని, నాడు మాట్లాడిన రేవంత్ రెడ్డి ఇప్పుడెందుకు మార్చడం లేదని ప్రశ్నించారు. సింగరేణి డబ్బులతో రాజీవ్ స్కిల్ డెవలప్‌మెంట్‌కు ఖర్చు చేస్తున్నారని, డీఎంఎఫ్‌టీ నిధులను కొడంగల్‌కు తరలించుకు వెళుతున్నారని మండిపడ్డారు. పెద్దపల్లి జిల్లా తెలంగాణ నెత్తిమీద నీటి కుండ లాంటిదని, కాళేశ్వరం ప్రాజెక్టు ఉన్నదే ఇక్కడ అని అన్నారు. మేడిగడ్డ బ్యారేజీకి చిన్న రిపేర్ వస్తే సరిదిద్దాల్సింది పోయి ప్రాజెక్టును పక్కన పెట్టారన్నారు. దీనిపై శ్రీధర్ బాబు సమాధానం చెప్పాలన్నారు. 50 లక్షల క్యూసెక్కుల ప్రవాహాన్ని తట్టుకున్న మేడిగడ్డ బ్యారేజీలో నీటిని నిల్వ చేయకుండా తెలంగాణను ఎండబెడుతున్నారని విమర్శించారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో 16 టీఎంసీల నీళ్లే ఉన్నాయని, సాగు, తాగు నీరు, పరిశ్రమల అవసరాలకు కాళేశ్వరం ప్రాజెక్టు లేకుండా ఎలా నీళ్లు ఇస్తారని ప్రశ్నించారు. తప్పుడు ప్రచారంతో ప్రభు త్వం రాజకీయాలు చేస్తున్నదన్నారు. కాళేశ్వరం లింకు 1 వాడి నీళ్ల ఇవ్వాలని శ్రీధర్‌బాబును డిమాండ్ చేశారు. పది రోజులకు ఒకసారి సీఎం, శ్రీధర్‌బాబు ఢిల్లీకి పోతున్నారని, కానీ ఈ ప్రాంత ప్రజల సమస్యలపై శ్రీధర్‌బాబుకు చిత్త శుద్ధి లేదని విమర్శించారు. హుస్సేనిమియా వాగులో నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నాయన్నారు.

కాంగ్రెస్ పార్టీకి బీసీ కులగణనపై చిత్తశుద్ధి లేదని, ఆగమాగం అసెంబ్లీలో బిల్లు పాస్ చేస్తారట, మేం కొట్టినట్లు చేస్తాం.. మీరు ఇచ్చినట్లు చేయాలన్నట్లుగా కాంగ్రెస్, బీజేపీ వైఖరి ఉందని, ఆ రెండు దొందు దొందేనని అన్నారు. కేసీఆర్ అసెంబ్లీకి రావాలంటున్నారని, రావాల్సిన సమయం వచ్చినప్పుడు కేసీఆర్ వస్తారు, అడుగుతారు, కడుగుతారు అని అన్నారు. కేంద్రం బడ్జెట్‌లో తెలంగాణకు కేటాయింపులు చేయలేదని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద సీఎం ధర్నా చేసి దొంగ ఏడుపులు పెట్టారన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీకి, టీబీజీకేఎస్‌కు మంచి రోజులు రానున్నాయని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాడాలని కవిత పిలుపునిచ్చారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, దాసరి మనోహర్ రెడ్డి, పుట్ట మధూకర్, టీఎస్‌టీఎస్ మాజీ చైర్మన్ డాక్టర్ చిరుమళ్ల రాకేష్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్, మాజీ మేయర్ రవీందర్ సింగ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్ సింగ్, మంథని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పుట్ట శైలజ, మూల విజయారెడ్డి, దాసరి ఉష, నాయకులు ఉప్పు రాజుకుమార్, మర్కు లక్ష్మన్, నారాయణదాసు మారుతి, జాగృతి జిల్లా అధ్యక్షుడు పెంట రాజేష్, టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్, ఒకేషనల్ పరీక్షలు

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ప్రాక్టికల్స్, ఒకేషనల్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి కల్పన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో సోమవారం 33 కేంద్రాలలో బాటని, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ప్రాక్టికల్స్ పరీక్షలు జరిగాయి. మొత్తం 370మంది విద్యార్థులకు గాను 367మంది విద్యార్థులు. ఒకేషనల్ ఎగ్జామ్‌కు గాను 780మంది విద్యార్థులకు 716మంది విద్యార్థులు ఉదయం హాజరు కాగా, మధ్యాహ్నం జరిగిన పరీక్షల్లో ప్రాక్టికల్స్‌కు 204మంది విద్యార్థులకు గాను 203మంది, ఒకేషనల్ ఎగ్జామ్‌కు 686మంది విద్యార్థులకు గాను 640మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి స్వప్నరాణి

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, గ్రామస్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి స్వప్నరాణి అన్నారు. సోమవారం గౌరెడ్డిపేటలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ధూమపానం, మద్యపానం వల్ల రానున్న రోజుల్లో క్యాన్సర్ వ్యాధి బారినపడి ప్రాణాలు కోల్పోతారని, వాటికి దూరంగా ఉండాలని సూచించారు. శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి తిరుపతి, న్యాయవాదులు శరత్ గ్రామస్థులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వద్దు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 3(ఆన్‌లైన్): మైనర్లకు వాహనాలు ఇవ్వద్దని గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి చెప్పారు. సోమవారం రాత్రి గోదావరిఖని చౌరస్తాలో వాహనదారులకు అవగాహన కల్పించారు. పిల్లలకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ వాహనాలకు ఇన్సూరెన్స్‌తోపాటు లైసెన్స్, ఆర్‌సీ కలిగి ఉండాలని సూచించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అక్షర శ్రీకారాలు.. ప్రత్యేక పూజలు

వైభవంగా వసంత పంచమి వేడుకలు



పెద్దపల్లిలో వసంత పంచమి సందర్భంగా చిన్నారుల నృత్యాలు

8

ఖోఖో కోచ్‌కు సన్మానం



నరేష్ నాయక్‌ను సన్మానిస్తున్న అలయన్స్ సభ్యులు

ధర్మారం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఖోఖో కోచ్ ఇస్లావత్ నరేష్ నాయక్‌ను సోమవారం లయన్స్ క్లబ్, అలయన్స్ క్లబ్ సభ్యులు సన్మానించారు. ఇటీవల జరిగిన ఖోఖో ప్రపంచ కప్‌ను భారత్ మహిళా టీం సొంతం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించాడు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రవీందర్ శెట్టి, అలయన్స్ క్లబ్ అధ్యక్షుడు మామిడిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సన్మానించారు. రాజేందర్, కామనీ శ్రీనివాస్, సామ ఎల్లారెడ్డి, ఎండి ముజాహిద్, కట్ట రమేష్, నాడెం శ్రీనివాస్, మిట్టపల్లి చంద్రకాంతరెడ్డి, అక్కనపల్లి చంద్రయ్య పాల్గొన్నారు.

బడ్జెట్‌ను సవరించాలి

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసనలు



ఖనిలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

8

ఇంటికో డప్పుతో కదిలిరావాలి

ఓదెల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాదులో ఈనెల 7న నిర్వహించనున్న లక్ష డబ్బులు వేల గొంతుల లాంగ్ మార్చ్ బహిరంగ సభకు మండలంలోని ప్రతీ మాదిగ ఇంటికో డప్పుతో కదిలి రావాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. గూడెంలో సోమవారం సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలుకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ లాంగ్ మార్చ్ సభను నిర్వహిస్తున్నారన్నారు. రేగుల సంపత్, తిప్పారపు ప్రభాకర్, రాజయ్య, కళ్యాణ్ రాజ్, తిప్పారపు రామచంద్రం, తిప్పారపు రమేష్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

నేత్ర, అవయవ దానాలపై అవగాహన

ఓదెల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మృతుడు కొండ్ర కొమురయ్య ఇంటి వద్ద సోమవారం సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్ర, అవయవ, శరీర దానాలపై అవగాహన కల్పించారు. నేత్రాలు దానం చేస్తే మరో ఇద్దరికి చూపు వస్తుందని తెలిపారు. అవయ దానం చేస్తే ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి, మరణించిన అనంతరం దేహదానంతో మెడికోలకు శిక్షణకు ఉపయోగపడతాయని అన్నారు. నేత్రదానం చేసిన కొమురయ్య కుటుంబానికి ప్రశంస పత్రాన్ని అందజేశారు. సదాశాయ ఫౌండేషన్ అధ్యక్షుడు కొండ్ర వేణు, మాజీ ఎంపీటీసీ బోడకుంట స్వామి, కాంగ్రెస్ నాయకుడు అల్లం సతీష్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు

అధికారుల కసరత్తు

- ఎంపీటీసీ స్థానాలు ఖరారు, రెండు గ్రామ పంచాయతీ మార్పు
- పురుషులకంటే 912 మంది మహిళా ఓటరే అధికం
- 65 పోలింగ్ స్టేషన్లు- 34,753 మంది జాబితా



ఎంపీడీవో ఆఫీసు నోటీస్ బోర్డుపై జాబితా ప్రదర్శిస్తున్న ఉద్యోగులు

మంథని/మంథనిరూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు మంథని మండలంలోని అధికార యంత్రాగం సమాయత్తమవుతోంది. మండలంలోని 32 గ్రామ పంచాయతీలు, 11 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. మండలంలో 38,690 మంది జనాభా ఉండగా వీరిలో 34,750 మందితో ఓటరు జాబితాలను సిద్ధం చేశారు. వీరిలో ముగ్గురు ఇతరులు ఉన్నారు. ఓటర్ల జాబితాలో 16,919 మంది పురుషులు ఉండ గా 17,831 మంది మహిళా ఓటర్ల ఉన్నారు. మండలంలో 912 మంది మహిళ ఓటర్లు అధికంగా ఉన్నారు.

కన్నాల ఎంపీటీసీ స్థానంలో ఉన్న రచ్చప ల్లి సింగరేణి విస్తరణలో నిర్వాసిత గ్రామం గా తరలించి బిట్టుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ఏర్పాటు చేయ డంతో ఈ గ్రామ పంచాయతీని సూరయ్య పల్లి ఎంపీటీసీ స్థానంలోకి మార్పులు చేశారు. కన్నాల ఎంపీటీసీ స్థానంలో ఓటర్ల సంఖ్య తగ్గడంతో గతంలో ఉప్పట్ల ఎంపీటీసీ పరిధిలో ఉన్న మల్లెపల్లి గ్రామ పంచాయతీని కన్నాల ఎంపీటీసీ పరిధిలోకి మార్చారు. ఎంపీటీసీ స్థానాలు ఖరారు చేస్తూ ఓటర్ల సమాచారాన్ని మండల పరిషత్ కార్యాలయం వద్ద నోటీస్ బోర్డు పై అంటించారు.

ఎంపీటీసీ స్థానం	ఓటర్లు	పోలింగ్ స్టేషన్లు
ఆరెంద	2905	6
నాగెపల్లి	3216	6
గద్దలపల్లి	3858	8
ఎక్లాస్‌పూర్	3338	6
సూరయ్యపల్లి	3794	5
అక్కెపల్లి	2717	5
లక్కెపూర్	2712	5
కన్నాల	2715	6
గుంజపడుగు	3386	5
చిల్లపల్లి	3107	6
ఉప్పట్ల	3005	7

పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు కోసం అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

అటవీ ప్రాంతంలో దినసరి కూలీ ఆత్మహత్య

● నాలుగు రోజుల క్రితం మృతి చెందినట్లు అనుమానం



సురేశ్‌నాయక్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో దినసరి కూలీ బానోతు సురేశ్‌నాయక్(35) అటవీ ప్రాంతంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఎల్లారెడ్డిపేట మం డలం కిష్టునాయక్ తండాలో సోమవారం వెలుగు చూసింది. నాలుగు రోజుల క్రితం గ్రామశివారులో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహం కుళ్లిపోయింది. పోలీసులు, కుటుంబసభ్యుల కథనం మేరకు.. గ్రామంలోని సురేశ్‌నాయక్ దినసరి కూలీగా పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో నాలుగురోజుల క్రితం సురేశ్‌నాయక్ భార్య సుజాత ఇద్దరుపిల్లలను తీసుకుని కామారెడ్డిజిల్లా మాచారెడ్డి మండలం సోమారిపేటలోని పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్థాపంచెందిన సురేశ్‌నాయక్ తనబైక్‌పై గ్రామశివారులోని ఎర్రగుట్ట ప్రాంతానికి చేరుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గొర్రెలు, మేకల కాపారులకు బైక్ కనిపించడంతో పాటు దుర్వాసన రావడంతో అక్కడకు చేరుకున్నారు. స్థానిక పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి స్థానికుల సహాయంతో సురేశ్‌నాయక్‌గా గుర్తించారు. మృతుడికి భార్య సుజాత, ఇద్దరు పిల్లలు, తల్లి సరోజన ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

కొడిమ్యాలలో యువకుడు..

కొడిమ్యాల, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన చిర్ర సంతోష్(25) సోమవారం అప్పుల బాధతో ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ సౌందర్య తెలిపారు. మృతుడి తల్లి చిర్ర మల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆస్తి పంపకాల్లో వచ్చిన డబ్బు అప్పులకు సరిపోని కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

ఉరేసుకొని ఒకరు..

హుజూరాబాద్ రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్పూర్ గ్రామంలో ఓవ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెల్పూర్ గ్రామానికి చెందిన చింతరెడ్డి అశోక్‌రెడ్డి(45) 15ఏళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం ఇంట్లోఎవరూలేని సమయంలో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

అప్పుల బాధతో ఒకరు..

ఎండపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎండపల్లి మండలం అంబారిపేట గ్రామంలో అప్పుల బాధతో అల్లె సాగర్ (28) అనే యువకుడు ఆదివారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వెల్గటూర్ ఎస్ఐ ఉమాసాగర్ కథనం మేరకు సాగర్‌కు మూడు నెలల క్రితం వివాహం జరిగింది. భార్య రెండు నెలల గర్భిణి. నెల రోజుల క్రితం తండ్రి ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లాడు. ఇటీవలే ఓ ఇంటిని కూడా కొనుగోలు చేశారు. వివాహం, ఇంటి అప్పు రూ.6 లక్షలు కావడంతో మనస్థాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని మృతి చెందాడు. తండ్రి సోమవారం గల్ఫ్ నుంచి వచ్చి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పర్మిట్ రూంలో వ్యక్తి మృతి

ముస్తాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండల కేంద్రంలోని ఓ వైన్స్‌షాపు పక్కన గల పర్మిట్ రూంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై సీహెచ్ గణేశ్ తెలిసిన వివరాల ప్రకారం.. నామాపూర్ గ్రామానికి చెందిన తీపిరి నారాయణ(53) సోమవారం వేకువ జామున పర్మిట్‌రూంలోకి వెళ్లాడు. ఉదయం ఎనిమిది గంటలకు అందులో పనిచేస్తున్న వ్యక్తి వచ్చే సరికి అచేతన స్థితిలో పడిపోయినట్లు తెలిపారు. ఫిట్స్‌తో , లేదా గుండెనొప్పితో చనిపోయినట్లు మృతుని కొడుకు శ్రీకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రేషన్‌బియ్యం పట్టివేత

మెట్‌పల్లిటౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లిలో అక్రమంగా తరలిస్తున్న 25 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని సోమవారం పోలీసులు, సివిల్ సప్లయిస్ సిబ్బంది పట్టుకున్నారు. కోదాండరామాలయం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 25క్వింటాళ్ల పీడీఎస్‌బియ్యం పట్టుకున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. బియ్యం, వాహనాన్ని సీజ్ చేశామన్నారు. ఈ తనిఖీల్లో మెట్‌పల్లి ఎస్ఐ కిరణ్ కుమార్, సివిల్ సప్లయిస్ సిబ్బంది పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్ష

● బాధిత బాలికకు రూ.2 లక్షల పరిహారం

జగిత్యాల క్రైం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార జైలు శిక్షతో పాటు బాధితురాలికి రూ.2 లక్షల పరిహారం చెల్లించాలంటూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ సోమవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనంప్రకారం జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన ఓ బాలికపై 2020సంవత్సరంలో సుంకల శ్రీనివాస్(21) అనే వ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పటి జగిత్యాల టౌన్ సీఐ జయేష్‌రెడ్డి నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, పోక్సోయాక్టుల కింద కేసునమోదు చేయగా డీఎస్పీలు ప్రకాష్, వెంకటరమణ విచారించారు. కోర్టు డ్యూటీ పోలీసులు సరైన సాక్ష్యులను ఫాస్ట్‌ట్రాక్‌స్పెషల్‌కోర్టులో ప్రవేశపెట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణరావు తమవాదనలు వినిపించగా నేరంరుజువు కావడంతో ముద్దాయికి జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. శిక్ష పడడంలో కృషి చేసిన పోలీసు అధికారులను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

వరకట్నం వేధింపుల కేసులో ఆరు నెలల జైలు

జగిత్యాల క్రైం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వరకట్నం వేధింపుల కేసులో ఒకరికి ఆరు నెలల జైలుశిక్షతోపాటు రూ.100 జరిమానా విధిస్తూ జగిత్యాల కోర్టు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ మెజిస్ట్రేట్ శ్రీనిజ సోమవారం తీర్పు వెలు వరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం జగిత్యాల రూరల్ మండలం అనంతారం గ్రామానికి చెందిన గాలిపెల్లి అంజయ్యకు 25ఏళ్ల క్రితం మల్యాల మండలం గొర్రెగుండం గ్రామానికి చెందిన నీరజతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. కొన్ని సంవత్సరాల తర్వాత అదనంగా వరకట్నం తేవాలంటూ అంజయ్య తన భార్య నీరజను తరచుగా వేధించాడు. తీవ్ర మనస్తాపానికి గురైన నీరజ 2020 మార్చి 19న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంత బాధిత కుటుంబ సభ్యులు జగిత్యాల రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై సతీష్ కేసు నమోదు చేశారు. కోర్టు డ్యూటీ పోలీసులు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశ పెట్టారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేష్ తమ వాధనలు వినిపించగా నేరం రుజువు కావడంతో ముద్దాయికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

శాతవాహనలో ప్రక్షాళన జరిగేనా?



● పరీక్షల నియంత్రణ విభాగంపై ఫిర్యాదులు ● కొనసాగుతున్న విజిలెన్స్ ఎంక్వైరీ

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ విభాగంపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు వచ్చాయి. ఏ విశ్వవిద్యాలయానికి అయినా పరీక్షల నియంత్రణ విభాగమే కీలకం. శాతవాహన విశ్వవిద్యాలయంలో పేపరు లీకేజీ, పరీక్షల జవాబు పత్రాల డిజిటలైజేషన్ స్కానింగ్ టెండర్లలో కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ఆరోపణలు వచ్చాయి. విశ్వవిద్యాలయానికి కొత్త ఉప కులపతి వచ్చినా పరీక్షల నియంత్రణ విభాగం ప్రక్షాళన దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు కనిపించడం లేదు.

గత వీసీ హయాంలో ఓ అధికారి అన్నీ తానై వ్యవహరించేవాడు. ఆయన హయాంలో జరిగిన డిగ్రీ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీ పెను సంచ లనంగా మారింది. దీనిపై అప్పటి ఉపకులపతి, రిజిస్ట్రార్ ఒక కమిటీ వేశారు. ఆ విచారణ ముందుకు సాగలేదు.

జవాబు పత్రాల డిజిటలైజేషన్‌పై ఫిర్యాదులు

గత వీసి హయాంలో కోసిన్ లిమిటెడ్ అనే సాఫ్ట్‌వేర్ సంస్థకు నామినేటెడ్ పద్ధతిలో జవాబు పత్రాలు డిజిటలైజేషన్ ప్రక్రియను అప్పజెప్పారు. ఇలా నాలుగు విద్యాసంవత్సరాలకు సంబంధించిన పరీక్షలను మూల్యాంకనాన్ని ఆ సంస్థ ద్వారానే కొనసాగించారు. నిబంధనల ప్రకారం ఐదు లక్షల రూపాయలకు మించిన ఏ పనిని అయినా టెండర్ నిర్వహించి అప్పజెప్పాలి.

ఒక విద్యా సంవత్సరంలో రెం డు సెమిస్టర్ల ద్వారా జరిగే యూజీ, పీజీ, ప్రొఫెషనల్ పరీక్షల జవాబు పత్రాలు లక్షల్లో ఉంటాయి. వీటి డిజిటలైజేషన్‌కు కోట్ల రూపాయల ఖర్చు అవుతుంది. ఈ ప్రక్రియను నామినేటెడ్ పద్ధతిపై ఒక సంస్థకు అప్పజెప్పడం పలు అనుమానాలకు దారి తీసింది. దీనిపై విద్యార్థి సంఘాల నాయకులు సామాజిక కార్యకర్తలు వివిధ రూపాల్లో ఆందోళనలు చేయడంతో అప్పటి వీసీ టెండర్ నోటిఫికేషన్ ఇచ్చారు. సరైన స్పందన రాలేదనే సాకు మళ్లీ అదే సంస్థకు నామినేషన్‌పై అప్పజెప్పారు. నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన వీసీ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ ఆదేశాలతో ఒక కమిటీని నియమించి పరీక్ష జవాబు పత్రాల డిజిటలైజేషన్ కోసం టెండర్ నోటిఫికేషన్‌ను జనవరి 17న ఇచ్చారు.

చర్యలు ఉంటాయా?

పరీక్షల నియంత్రణ విభాగం, విశ్వవిద్యాలయంలో జరిగిన అవినీతి, అక్రమాల మీద సామాజిక కార్యకర్తలు పోరాటాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ ఎంక్వయిరీకి ఆదేశించింది. గతలో పని చేసిన అధికారులు ఈ విచారణకు సహకరించ లేదనే విమర్శలున్నాయి. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులను వెంటనే తొలగించాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు. అన్ని రకాల అక్రమాలపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి తీవ్రగాయాలు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్ గ్రామ శివారులోని కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై సోమవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామానికి చెందిన ఐదేళ్ల వయసు ఉన్న బాలుడు చేకూటి మోక్షిత్ రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని వాహనంలో సిరిసిల్లకు తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో కరీంనగర్‌కు తీసుకెళ్లారు. నిజామాబాద్‌కు చెందిన చేకూటి మమత తన పిల్లలను తీసుకుని హరిదాస్‌నగర్ గ్రామానికి బంధువుల ఇంటిలో జరిగే శుభకార్యానికి వచ్చింది. ఆమె కొడుకు మోక్షిత్ రోడ్డు దాటుతున్న క్రమంలో ఎల్లారెడ్డిపేట నుంచి సిరిసిల్ల వైపునకు వెళ్తున్న కారు ఢీకొట్టింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హన్మంతునిపేట గ్రామానికి చెందిన వడ్లకొండ లక్ష్మయ్య అనే గీత కార్మికుడు ఆదివారం రాత్రి తాటి చెట్టు ఎక్కుతుండగా మోకు జారీ కింద పడగా తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి లక్ష్మయ్యను పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. నిరుపేద కుటుంబానికి చెందిన లక్ష్మయ్యను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పెళ్లి చేసుకోవాలని యువతి న్యాయ పోరాటం



బిడ్డతో కలిసి న్యాయ పోరాటం చేస్తున్న శిరీష

ధర్మారం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సహజీవనం చేసిన వ్యక్తి వివాహం చేసుకోవాలని 8 రోజులుగా ఓ మహిళా అతడి ఇంటి ఎదుట న్యాయ పోరాటం చేస్తున్న ఘటన మేడారంలో చోటుచేసుకుంది. మండలంలోని బొట్లవనపర్తి గ్రామానికి చెందిన ఆవుల శిరీషకు మేడారం గ్రామానికి చెందిన రాచూరి వెంకటేష్‌లు ప్రేమించుకున్నారు. అనంతరం శిరీషకు హన్మకొండకు చెందిన వ్యక్తితో వివాహం కాగా వెంకటేష్ శిరీష భర్తకు ఫోన్ చేసి విడాకులు ఇవ్వాలని కోరాడు. విడాకుల అనంతరం శిరీష వెంకటేష్ ఇంట్లో ఉంటూ రెండు సంవత్సరాలుగా సహజీవనం చేస్తోంది. వీరికి రెండు సంవత్సరాల పాప ఉంది. ఈ క్రమంలో పెళ్లి చేసుకోవాలని శిరీష వెంకటేశ్‌ను ఒత్తిడి చేసింది. ఈ విషయంలో ఇరువురి మధ్య నెలరోజులుగా గొడవలు అవుతున్నాయి. ఈ క్రమంలో శిరీష తల్లిగారు ఇళ్లు బొట్లవనపర్తికి వెళ్ళింది. గత నెల 26న శిరీష పెద్ద మనుషులతో కలిసి వెంకటేష్ ఇంటికి వెళ్ళగా తాళం వేసి వెళ్లిపోయారు. అప్పటి నుంచి శిరీష వెంకటేష్ ఇంటి ఎదుట న్యాయ పోరాటం చేస్తోంది. ఎనిమిది రోజులుగాకూతురుతో బొట్లవనపర్తి నుంచి వెంకటేశ్ ఇంటికి ఉదయం వచ్చి సాయంత్రం వరకు ఉండి వెళుతోంది. వెంకటేష్ సామాజికవర్గమైన మున్నూరు కాపు సోదరులారా నాకున్యాయం చేయండి, మేడారం గ్రామప్రజలారా న్యాయం చేయండి అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తోంది. వెంకటేశ్‌తో వివాహం అయ్యే వరకు పోరాటం చేస్తానని, తన చావైనా బతుకైన వెంకటేశ్‌తోనే అని పేర్కొంది. అధికారులు జోక్యం చేసుకొని న్యాయం చేయాలని కోరుతోంది.

తాత వద్దకు చేరిన ధృవన్

● అప్పగించిన ఏఎస్పీ శుభం ప్రకాష్
● పోలీసుల అదుపులో నిందితులు?



బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న కరీంనగర్ రూరల్ ఏసీపీ శుభం ప్రకాశ్

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): గంగాధర పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొండన్నపల్లి గ్రామశివారులో గతనెల27న హత్యకుగురైన మమత కొడుకు ధృవన్ క్షేమంగా ఉన్నాడు. కరీంనగర్ రూరల్ ఏసీపీ కార్యాలయంలో ఏఎస్పీ శుభం ప్రకాష్ సోమవారం బాలుడిని తాత, నానమ్మలకు అప్పగించారు. అనంతరం ఆయన సంఘటన వివరాలు వెల్లడించారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఖాసీంపేటకు చెందిన మమత (25), భరత్ ఆరేళ్ల క్రితం ప్రేమవివాహం చేసుకున్నారు. వారికి నాలుగేళ్ల కుమారుడు ధృవన్ ఉన్నాడు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలతో నాలుగు నెలల నుంచి వేరుగా ఉంటున్నారు. మమత తన కొడుకుతో మంచిర్యాలలోని బంధువుల ఇంట్లో ఉంటోంది. గత నెల 25న బంధువుల ఇంటి నుంచి మమత ఆమె కొడుకుతో సహా బయటకు వెళ్లింది. అనూహ్యంగా కొండన్నపల్లి శివారులో హత్యకు గురైంది. మమత వెంట ఉన్న బాలుడు అదృశ్యమయ్యాడు. పోలీసులు ప్రత్యేక పోలీసు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. చెన్నైలో ఒకహోటల్‌లో ఉన్న నిందితులతో పాటే బాలుడు ఉన్నట్లు గుర్తించారు. పథకం ప్రకారం ఆదివారం వారిని పట్టుకునే ప్రయత్నం చేయగా అప్రమత్తమైన నిందితులు బాలుడిని హోటల్ గదిలో వదిలేసి పారిపోయారు. బాలుడిని కరీంనగర్ తీసుకొచ్చి నానమ్మ, తాతయ్య మేడ రాంచందర్, లక్ష్మీకి అప్పగించామని ఏఎస్పీ తెలిపారు. కేసు విచారణ కొనసాగుతున్నదని, మమత హత్యకు కారణమైన నింది తులను త్వరలో పట్టుకుంటామని, పూర్తి వివరాలు వెల్లడిస్తామని వివరించారు. కాగా నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు, వారిలో ఒక మహిళ ఉన్నట్లు తెలుస్తోంది.

అఘోరీ హల్‌చల్



అఘోరీని సిద్దిపేట వైపు తరలిస్తున్న పోలీసులు

● వేములవాడకు వెళ్తుండగా సిరిసిల్ల జిల్లా సరిహద్దులో అడ్డుకున్న పోలీసులు ● మూడు గంటల పాటు ఉద్రిక్తత

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ ఆలయంలోని దర్గాను కూల్చి వేస్తానని అఘోరీ సోమవారం వేములవాడకు వెళ్తుండగా పోలీసులు జిల్లా సరిహద్దులో అడ్డుకున్నారు. రాష్ట్రంలో సంచలనంగా మారిన అఘోరీ ఫిబ్రవరి 3వతేదీన వేములవాలోని దర్గాను కూల్చి వేస్తానని సంచలన వాఖ్యలు చేయడంతో పోలీసులు ముంద స్తుగా జిల్లా సరిహద్దుతోపాటు తంగళ్లపల్లి, జిల్లెల్ల ప్రాంతాల్లో ప్రత్యేకపోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేశారు. అఘోరీ ప్రకటించిన విధంగానే సోమవారం సాయంత్రం వేముల వాడకు వస్తుండగా తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల శివారులోని జిల్లా సరిహద్దులో అఘోరీని పోలీసులు అడ్డుకున్నారు. అఘోరీ కారులోనే కూర్చోగా పోలీసులు కారును చుట్టుముట్టారు. సుమారు మూడు గంటల పాటు కారులోనే ఉన్న అఘోరీ పోలీసులు నచ్చజెప్పినప్పటికీ కారుదిగలేదు. పోలీసులు రికవరీ వ్యాన్‌ను తెప్పించి కారును అఘోరీతో పాటు సిద్దిపేట వైపు తరలించారు. అఘోరీని చూడడానికి ప్రజలు ఆసక్తి చూపడంతో రోడ్డుపై వాహనాలు నిలిచి పోయాయి. దీంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది.

వేములవాడలో పోలీసుల బందోబస్తు

వేములవాడ కల్చరల్: రాజన్న ఆలయంలోని ఫిబ్రవరి 3వతేదీన దర్గాను కూల్చివేస్తానని అఘోరీ చేసిన వాఖ్యలతో వేములవాడలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. సోమవారం అఘోరీ వేములవాడకు వస్తుండగా జిల్లా సరిహద్దులో పోలీసులు అడ్డుకున్నారు. అఘోరీ వ్యాఖ్యలు స్థానికంగా ఉత్కంఠ రేపుతున్నాయి. పోలీసులను తప్పించుకుని అఘోరీ వేమలవాడకు చేరుకుంటుందా అనే చర్చ జరుగుతోంది.

అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన కారు



వడుకాపూర్ గ్రామ శివారులో ప్రమాదానికి గురైన కారు

జూలపల్లి, ఫిబ్రవరి 3. (ఆంధ్రజ్యోతి): వడుకాపూర్ శివారులో సోమవారం రాత్రి కరీంనగర్‌కు వెళ్తున్నకారు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్ళింది. మద్యం మత్తులో వేగంగా కారు నడపడంతో అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దీంతో స్తంభం విరిగిపోయి కారు సమీప పొలాల్లోకి దూసుకువెళ్ళిందని స్థానికులు తెలిపారు. కారులో ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం జరుగలేదని, కారుకు మాత్రం ముందు భాగం దెబ్బతిన్నదని తెలిపారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఎవరూ గాయపడలేదని ఏఎస్ఐ చంద్రమౌళి పేర్కొన్నారు.

పోలీసుల అదుపులో హత్య కేసు నిందితులు?

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌రూరల్ మండలం బొమ్మకల్‌కు చెందిన బెజ్జంకి మహేష్(22) హత్యకేసు నిందితులను పోలీసుల అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. బొమ్మకల్‌లోని పంచాయతీ కార్యాలయం సమీపంలో గ్రామానికి చెందిన మహేష్, సతీష్ మరో ఇద్దరు స్నేహితులు కలిసి ఆదివారం మధ్యాహ్నం మద్యంతాగారు. గ్రామంలో నెల రోజులకిందట వివాహేతర సంబంధం బయట పడిన విషయంవారి మధ్యచర్చకు వచ్చింది. తనతోనే ఉంటూ వివాహేతరసంబంధం బయట పెట్టావంటూ సతీష్ అనేవ్యక్తి ఆవేశానికిలోనై బెజ్జంకి మహేష్‌ను బీరుసీసాతో గొంతుకోసి హత్యచేశాడు. మహేష్ కుటుంబసభ్యుల ఫిర్యాదుతో సతీష్‌తో పాటు మరోఇద్దరిపై కరీంనగర్‌రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. మహేష్ మృతదేహానికి సోమవారం కరీంనగర్‌ప్రభుత్వాస్పత్రిలో పోస్ట్‌మార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. గ్రామంలో గొడవలు చోటు చేసుకోకుండా పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి


పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రాఘవపూర్ గ్రామానికిచెందినస్వాతి(36)చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలిభర్త మద్యానికి బానిస కాగా ఎన్ని సార్లు చెప్పిన వినకపోగా అతనిపై విసుగుచెంది ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నం చేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు పెద్దపల్లి ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందింది. మృతురాలి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు తెలిపారు. మృతు రాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పట్టపగలే చోరీ

జూలపల్లి, ఫిబ్రవరి 3. (ఆంధ్రజ్యోతి) మండలంలోని వడుకాపూర్ గ్రామానికి చెందిన దుంపెట తిరుపతి ఇంట్లో చోరీ జరిగింది. సోమవారం తిరుపతి బంధువు వివాహం అదేగ్రామంలో జరగగా అక్కడికి వెళ్ళి ఇంటికి తిరిగివచ్చారు. ఇంటి తాళం పగులగొట్టిన దొంగలు బీరువాలోని లక్షరూపాయల నగదును ఎత్తుకె ళ్లారు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వేంపల్లి చెరువులో మొసలి

మల్లాపూర్, ఫిబ్రవరి, 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేంపల్లి గ్రామంలోని చెరువులో మొసలి ప్రత్యక్షమైంది. సోమవారం ఉదయం చెరువు ఒడ్డున మొసలి సంచరిస్తుండగా అటు వైపు వెళ్తున్న రైతులకు కనిపించడంతో వారు భయాందోళనలకు గురయ్యారు. నాలుగు రోజులు చెరువు పరిసరాల్లో మొసలి సంచరిస్తున్నట్లు గుర్తించారు. ఫారెస్ట్ అధికారులు మొసలిని పట్టుకుని అటవీ ప్రాంతాలకు తరలించి గ్రామ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.



వేంపల్లిలోని చెరువులో మొసలి

గన్నేరువరం వీవోఏ తొలగింపు

గన్నేరువరం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన హరిప్రియ గ్రామైక్య సంఘం వీవోఏగా విధులు నిర్వహిస్తున్న న్యాత పుష్పలతను విధుల నుంచి తొలగించినట్లు ఏపీఎం లావణ్య తెలిపారు. ఇటీవల మండల కేంద్రంలో నిర్వహించిన నాలుగుపథకాల గ్రామసభలో తాను ఉద్యోగురాలి నని మరచిన వీవోఏ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తనకు పథకాలు రాలే దంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో క్రమశిక్షణ రాహి త్యంగా వ్యవహరించినందుకు గాను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం గ్రామైక్య సంఘం సమావేశం నిర్వహించి ఆమెను విధుల నుంచి తొలగించినట్లు ఏపీఎం లావణ్య తెలిపారు.

కార్పొరేట్ శక్తులకు, ధనికులకు ఊతమిచ్చే బడ్జెట్

- బడ్జెట్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీలకు మొండి చేయి
- జాతీయ బీసీ సంక్షేమ సంఘం యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం స్వామి



మాట్లాడుతున్న శీలం స్వామి

ముస్తాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ శక్తులకు ధనికులకు ఊతమిచ్చే బడ్జెట్ అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం స్వామి పేర్కొన్నారు. ముస్తాబాద్‌లో సోమవారం మాట్లాడుతూ గత రెండు రోజుల క్రితం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ పేదలను అణగదొక్కుతూ ధనవంతులను ఇంకా ధనికులుగా చేసే విధంగా ఉందని ఆరోపించారు. మధ్య తరగతి ప్రజల నుండి పన్నుల రూపేణా రూ 52 లక్షల65వేల 300 వసూలు చేసే దిశగా అడుగు పెట్టి అందులో నుండి పేదలకు 12లక్షలకోట్లు ఖర్చుపెట్టి మిగితా లక్షలకోట్లను దేశంలో ఉన్నటువంటి కార్పొరేట్ శక్తులకు, ధనవంతులకు, పారిశ్రామిక వేత్తలకు ఖర్చు చేసే దిశగా వెళుతున్నారన్నారు.దేశంలో బీసీ , ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలను మోసం చేసే దిశగా బడ్జెట్ ఉందని జీఎస్టీ రూపంలో, ట్యాక్స్‌ల రూపంలో వేలకోట్లు కేంద్రం తీసుకుంటూ తెలంగాణకు మొండి చేయి చూపారన్నారు.

క్యాన్సర్‌ను జయిద్దాం

- ప్రాథమిక దశలో గుర్తిస్తే ప్రయోజనం
- వ్యాధిపై జాగ్రత్తలు అవసరం
- నేడు ప్రపంచ క్యాన్సర్ డే

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

క్యాన్సర్ వచ్చింది.. ఇక జీవితం ముగిసి పోతుందని చింతించాల్సిన పని లేదు. గుండె నిబ్బరంతో పోరాటం చేయవచ్చు. అప్రమత్తతతో తొలిదశలోనే గుర్తిస్తే క్యాన్సర్‌ను జయించవచ్చని డాక్టర్లు చెబుతున్నారు. ఎంతో మంది క్యాన్సర్ బారిన పడి ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ తమ జీవితకాలాన్ని పొడిగించుకున్న వాళ్లు ఉన్నారు. పూర్తిగా క్యాన్సర్‌ను దూరం చేసిన వాళ్లూ ఉన్నారు. తొలిదశలో క్యాన్సర్‌ను గుర్తించకపోవడంతో అనేక మంది మృత్యువాత పడుతున్నది వాస్తవమే. క్యాన్సర్ అంటే ఇక జీవితం నుంచి క్యాన్సిల్ కాదని వైద్య నిపుణులు చెపుతున్నారు. ప్రధానంగా నోటి క్యాన్సర్, గొంతు, ఊపిరి తిత్తులు, జీర్ణకోశ క్యాన్సర్‌తో మహిళల్లో రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ కేసులు ఎక్కువగా ఉన్నాయి. పురుషులు ఎక్కువగా పొగ్రతాగడం, పొగాకు నమలడం, మద్య పానం వల్ల నోటి క్యాన్సర్ వస్తోంది.





క్యాన్సర్ అంటే..

శరీరంలో కణవిభజన నిరంతరం జరుగుతూనే ఉంటుంది. ఏ రకమైన కణాలు ఎంత వేగంగా విభ జన జరుగాలి. అనే దాన్ని కణం యొక్క కేంద్రంలోని క్రోమోజోముల్లోని ఒక జన్యువు ఉంటుంది. దీన్ని రెగ్యులేటర్ జీన్‌గా పిలుస్తారు. ఏ కారణం చేతనైనా ఈ రెగ్యులేటర్ జీన్ మాట వినకపోతే కణాలు అదుపులేకుండా విభజన జరుగుతాయి. క్రమ పద్ధతి లేనందున కణాలకు రక్తం సరఫరా సరిగా ఉండదు. రక్తం సరిగా అందని ప్రాంతం కుల్లిపోవడం జరుగు తుంది. ఇది శరీరంలో ఏ అవయవానికైనా జరగ వచ్చు. దీన్ని క్యాన్సర్ లక్షణాలుగా చెప్పుకోవచ్చు. కొంత మంది కుటుంబంలో కొన్ని రకాల క్యాన్సర్లు కొన్ని తరాల నుంచి వస్తున్నట్లుగా గుర్తించారు. వృత్తు ల వారీగా వస్తున్న క్యాన్సర్లు కూడా ఉన్నాయి. ఈ క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే కొంత వరకైనా ప్రాణాలు కోల్పోకుండా రక్షించుకోవచ్చు.

నేపథ్యం..

ప్రపంచ ఆరోగ్య సంస్థ క్యాన్సర్‌ను నివారించవచ్చని గుర్తించింది. 2000ల సంవత్స రంలో పారిస్‌లో జరిగిన సమావేశంలో ఫిబ్రవరి 4న ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని జరుపాలని నిర్ణయించారు. 2025లో 15 లక్షల కొత్త కేసులు నమోదు అవుతాయని భావిస్తున్నారు. కేసులు పెరుగుతున్న సందర్భంలో ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర ్ణయించి అవగాహన కార్యక్రమాలను నిర్వహి స్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా చూస్తే 12శాతం ఉంది. రాబోయే 10సంవత్సరాల్లో 80మిలియన్ల మంది ఈ వ్యాధి బారిన పడే అవకాశం ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించింది.

ఎలా వస్తుంది..

క్యాన్సర్ శరీరంలో ఏ అవయవానికైనా రావచ్చు. సాధారణంగా కొంత మంది కుటుం బంలో కొన్ని రకాల క్యా న్సర్లు కొన్ని తరాల నుంచి వస్తున్నట్లుగా ఆధారాలు ఉన్నాయి. అటువంటి వాళ్లను గుర్తించి ముందుగా పరీక్షలు చేయిస్తే కొంత మేరకు ప్రాణా లను రక్షించవచ్చు. గనుల పరిశ్రమ, పెయింటింగ్, రసాయనాల పరిశ్రమల్లో పనిచేసే వారికి క్యాన్సర్లు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. మనం తినే తిండి నీటిలో కలిసి ఉన్న రసాయనాలు కూడా క్యాన్సర్‌ను తెచ్చి పెట్టే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా పొగ తాగడం వల్ల ఊపిరి తిత్తుల్లో, అన్నవాహికకు, మల ద్వారం, ఇలా ఎక్కడైనా క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని నిర్ధారణ అయ్యింది. వందలో 24శాతం పొట్టలో అన్న వాహికకు క్యాన్సర్లు వస్తున్నాయని, 16శాతం ఊపిరి తిత్తుల్లో, 15శాతం రొమ్ముకు, పేగు లకు, ఊపిరితి త్తులకు, రొమ్ములకు కలిసి 100లో 50శాతం క్యాన్సర్లు కనిపిస్తాయి. 13శాతం మూత్ర కోశం, మూత్ర పిండాలు, చర్మానికి 9శాతం, గర్భసంచి, గర్భసంచి ముఖ ద్వారంలో నూ, అండాశ యాల్లోనూ క్యాన్సర్ నూటికి 9వంతులు ఉంటుంది. మిగితా అన్ని అవయ వాలకు 14శాతం ఉంది.


లక్షణాలు..

క్యాన్సర్ గుర్తించడానికి కొన్ని లక్ష ణాలను గమనం లోకి తీసుకోవా లి. దగ్గితే రక్తం పడడం, మూత్రంలో రక్తం పడడం, మలంలో రక్తం కనిపించడం, మల విసర్జనలో మార్పు లు, యోనిద్వారంలో రక్తం పోవడం, బహి ష్టులో యోని ద్వారం గుండా రక్తం పోవడం, మెనోపాజ్ తరువాత రక్తం పోవ డం భార్య భర్తలు కలిసిన తరువాత రక్తం పోవడం, చాలా కాలంగా తగ్గకుండా ఉండే దగ్గు, రొమ్ములో గడ్డ, మెడలో గడ్డలు, చాలా కాలంగా మానకుండా ఉండే పుండ్లు, ఎలాంటి కారణం లేకుం డా అలసట, బరువు తగ్గి పోవడం, అన్నం తినలేక పోవడం వంటి లక్షణాలను బట్టి క్యాన్సర్‌ను కూడా అనుమానించాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

క్యాన్సర్ నివారణ ప్రధానంగా మన చేతుల్లోనే ఉంది. పొగ తాగడం మానేయడం, ఎక్కువగా పీచు ఉండే పదార్థాలు తింటే పేగుల్లో క్యాన్సర్ రాకుండా నివారించుకోవచ్చు. పోషకాహారం తీసుకోవాలి. పెరిగే పిల్లలకు కాల్షియం అధికంగా ఉన్న ఆహార పదార్థాలు అవసరం. ఆకుకూరలు, ఇతర కూరలు, పండ్లు సమృద్ధిగా వాడాలి. విటమిన్-ఏ అధికంగా ఉన్న ఆహార పదార్థాలు తినాలి. వంట నూనెలు, మాంసం వంటి పదార్థాలు తగ్గించాలి. ఉప్పు పరిమితంగా వాడాలి. వనస్పతి, నెయ్యి, వెన్న చాలా అరుదుగా వాడుకోవాలి.





కార్పొరేట్, రియల్టర్లకు డిపాజిట్ దక్కదు

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ ఉపాధ్యాయఎమ్మెల్సీ స్థానానికి కార్పొరేట్ సంస్థలకు చెందిన వ్యక్తులు, రియల్ ఎస్టేట్ చేస్తున్న మిత్రులు పోటీ చేస్తున్నారని, వారికి డిపాజిట్ దక్కదని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. సోమవారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులుగా పనిచేసిన వారికే ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యలు తెలుస్తాయన్నారు. తాను 30సంవత్సరాల పాటు ఉపాధ్యాయుడిగా, మండల విద్యాధికారిగా, జిల్లా నోడల్ అధికారిగా పనిచేశానని, ఆరు సంవత్సరాల ఎమ్మెల్సీగా అనుభవం ఉందని అన్నారు. మండలస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఉద్యమాల్లో పాల్గొన్న వ్యక్తిగా తనకు ఉపాధ్యాయుల సమస్యలు, విద్యారంగ సమస్యలు పూర్తిస్థాయిలో తెలుసునన్నారు. అందుకనే ఇంటర్ జేఏసీ, ఎస్టీయూ జేఏసీ, తెలంగాణ పీఆర్‌టీయూ జేఏసీ పక్షాన, ఉపాధ్యాయ, అధ్యాపక ఉమ్మడి అభ్యర్థిగా మరోసారి నామినేషన్ వేసినట్లు చెప్పారు. మనఉన్నతికి ఉపాధ్యాయ వృత్తికి ఇంకా విలువతెచ్చుకోవాల్సిన అవసరం ఉందని, అందుకనే వారిని డిపాజిట్ లేకుండా ఓడించాలని అన్నారు.

దేవాదాయశాఖ సహాయ కమిషనర్ కార్యాలయ నూతన భవనం ప్రారంభం



నూతనంగా నిర్మితమయ్యే సహాయ కమిషనర్ కార్యాలయంలో ఏసీ నాయిని సుప్రియతో ఈవోలు, సిబ్బంది

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడిజిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్ నూతన కార్యాలయ భవనం సోమవారం ప్రారంభమైంది. సుమారు 25 సంవత్సరాలుగా కోర్టు వద్ద రాజరాజేశ్వర కల్యాణమండపం మొదటిఅంతస్తులో కార్యకలాపాలు కొనసాగేవి. పరిపాలనా సౌలభ్యం, కార్యకలాపాలు, సౌకర్యాల విషయాలను దేవాదాయశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా ప్రశాంతనగర్ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయ కల్యాణమండపం గ్రౌండ్ ఫ్లోర్‌లోకి మార్చేందుకు నిర్ణయించారు. కొన్ని నెలలుగా అన్ని వసతులతో కూడిన నిర్మాణ పనులు చేపట్టారు. ఇంకా కొంతపని మిగిలి ఉండడంతో ఈ నెల12నుంచి కార్యాలయం పూర్తిస్థాయిలోకి అందుబాటులోకి రానున్నట్లు సమాచారం. వసంతపంచమి సందర్భంగా భవనంలో సహాయ కమిషనర్ నాయిని సుప్రియ పుణ్యాహవాచనంలో పాల్గొన్నారు. భవనాన్ని ప్రారంభించి మొక్కను నాటారు.

జాతీయ సమైక్యత శిబిరానికి శాతవాహన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): జాతీయ సమైక్యత శిబిరానికి శాతవాహన యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పేసరి అజయ్(ఎస్సారార్ డిగ్రీకళాశాల), మనీషా, ప్రియాకుమారి(ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, జగిత్యాల) ఎంపికైనట్లు ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం చైర్మన్, ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కల్వకుంట్ల రామకృష్ణ తెలిపారు. పశ్చిమగోదావరిజిల్లా నరసాపురంలోని వైఎన్‌రెడ్డి కళాశాలలో ఈనెల3నుంచి9వరకు కొనసాగేశిబిరంలో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 50మందివలంటీర్లు పాల్గంటున్నట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా వలంటీర్లను ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్లు పడాల తిరుపతి, సుజాత, అర్జున్, ఎలిజబెత్ రాణి, రాజేశం, రాపర్తిశ్రీనివాస్, సంగీతా రాణి, శ్రీలత అభినందించారు.



జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొంటున్న శాతవాహన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

ప్రభుత్వ వైఫల్యంతోనే రైతుల ఆత్మహత్యలు

- మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వ వైఫల్యంతోనే రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. నర్సక్కపేట గ్రామంలో ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న రైతు శ్రీనివాస్ కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చితే కాంగ్రెస్ వచ్చాక రైతుల పరిస్థితి దారుణంగా మారిందన్నారు. రుణమాఫీ పూర్తిస్థాయిలో కాకపోవడం, పెట్టుబడి సాయం అందకపోవడంతోనే ఆత్మహత్యలు పెరుగుతున్నాయని విమర్శించారు. రైతుల ఆత్మహత్యలు ప్రభుత్వ హత్యలే అని, రైతులు మనోధైర్యం కోల్పోవద్దని బీఆర్‌ఎస్ అండ గా నిలుస్తుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హమీలు అమలు చేసేంతవరకు బీఆర్‌ఎస్ పోరాటం చేస్తుందన్నారు. సమావేశంలో జడ్పీమాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహ్మారెడ్డి, నాయకులు జితేందర్‌గౌడ్, మీసరగండ్ల అనిల్‌కుమార్, గొట్టెపర్తి పర్శరాం, సావనపెల్లి అనిల్‌కుమార్, సాదుల్, రాగటి రమేష్, మల్యాల రాజశేఖర్, రాజారాం, కూనబోయిన రఘు, శ్రావణ్‌కుమార్‌లతో పాటు వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

తప్పుల తడకగా బీసీ కులగణన

- తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరేందర్‌గౌడ్

హుజూరాబాద్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వే తప్పుల తడకగా ఉందని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం నరేందర్‌గౌడ్ అన్నారు. సోమవారం హుజూరాబాద్ పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. 1931 లెక్కల ప్రకారం దేశంలో 52శాతం బీసీలు ఉండగా, అప్పటినుంచి ఇప్పటివరకు బీసీల జనాభా పెరిగి 70శాతం చేరిందన్నారు. గతంలో బీఆర్‌ఎస్ చేసిన సమగ్ర కుల సర్వేలో 58శాతం బీసీలను చూపించి మోసం చేయగా, అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం కూడా చేస్తోందన్నారు. గత ప్రభుత్వాలు బీసీలకు అన్యాయం చేసుకుంటూ వచ్చాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్‌ను అమలు చేయాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో బీసీ సంఘం నాయకులు శ్రీనివాస్‌గౌడ్, అయిలయ్యగౌడ్, సదానందంగౌడ్, అయిలయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు నామినేషన్లు షురూ!

- తొలిరోజు పట్టభద్రుల స్థానానికి ఆరు..
- ఉపాధ్యాయ స్థానానికి మూడు నామినేషన్లు

కరీంనగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాలకు నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. సోమవారం ఈ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీకాగానే పట్టభద్రుల స్థానానికి ఆరుగురు అభ్యర్థులు ఎనిమిది సెట్ల నామినేషన్లు, ఉపాధ్యాయుల స్థానానికి ముగ్గురు అభ్యర్థులు ఐదునామినేషన్లు వేశారు. వీరిలో ఇద్దరు అభ్యర్థులు పట్టభద్రుల, ఉపాధ్యాయుల స్థానాలు రెండింటికి నామినేషన్ వేశారు. పట్టభద్రుల స్థానంలో సిలివేరి శ్రీకాంత్(జమ్మికుంట), గవ్వల లక్ష్మి (దేవునిగూడెం), చాలిక చంద్రశేఖర్(హైదరాబాద్), మంచికట్ల ఆశమ్మ(ఆదిలాబాద్), కంటెసాయన్న (మేడ్చల్), దూడ మహిపాల్(ధర్మపురి) నామినేషన్లు వేశారు. ఉపాధ్యాయుల స్థానానికి సిలివేరి శ్రీకాంత్, చాలిక చంద్రశేఖర్, కూర రఘోత్తంరెడ్డి(గోనెపల్లి) నామినేషన్లు వేశారు. సిలివేరి శ్రీకాంత్, చాలిక చంద్రశేఖర్ అటు పట్టభద్రుల స్థానానికి, ఇటు ఉపాధ్యాయుల స్థానానికి నామినేషన్లను దాఖలు చేశారు. కరీంనగర్ కలెక్టర్, ఎమ్మెల్సీ ఎన్నికల అధికారి పమేలా సత్పతి ఈ నామినేషన్లను స్వీకరించారు.

● 10 వరకు నామినేషన్ల స్వీకరణ

ఎమ్మెల్సీ ఎన్నికలఅధికారి పమేలా సత్పతి మాట్లాడుతూ ఈ రెండు ఎమ్మెల్సీస్థానాలకు తాను రిటర్నింగ్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్నానని, ఈనెల 10వతేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తామని తెలిపారు. 8,9 తేదీల్లో ప్రభుత్వ సెలవులు ఉండడంతో నామినేషన్ల స్వీకరణ ఉండదని, మిగతా పనిదినాల్లో ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తామని ఆమె తెలిపారు. ఈనెల 11న నామినేషన్ల పరిశీలన, 13న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. మార్చి 3న ఓట్ల లెక్కింపు చేపట్టి పూర్తికాగానే ఫలితాలుప్రకటిస్తామని చెప్పారు. నామినేషన్ల సందర్భంగా అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సందేహాలను నివృత్తి చేసేందుకు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటుచేశామని వివరించారు. అభ్యర్థులు ఎన్నికల సందర్భంగా ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలని, ర్యాలీలు, సభలు, సమావేశాలకు ముందస్తు అనుమతి తీసుకోవాలని ఆమె సూచించారు.

ధర్మపురిలో ఘనంగా వసంత పంచమి వేడుకలు



ఇసుక స్తంభం వద్ద స్వామి వారలకు వసంతోత్సవ పూజలు

ధర్మపురి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి, అనుబంధ దేవాలయాల్లో వసంత పంచమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారలకు ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం వేళలో శ్రీలక్ష్మీ నృసింహస్వామి (యోగ,ఉగ్ర) వారల సేవలను మంగళవాయిద్యాలు వెంటరాగా పుర వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఇసుక స్తంభంవద్ద గల మండపంలో స్వామివారలను ఆశీనులు చేసి వేదమంత్రాల మధ్య అర్చకులు ప్రత్యేకపూజలు, హారతి కార్యక్రమాలను నిర్వహించారు. దూర ప్రాంతాలకు చెందిన చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఆలయఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ పాల్గొన్నారు.



ధర్మపురి లక్ష్మీనృసింహస్వామి వారలకు హారతి పూజలు

భక్త జనసంద్రంగా వేములవాడ

- భక్తులతో కిక్కిరిసిపోయిన లైన్‌లు
- 300 మంది వరకు శివదీక్ష తీసుకున్న భక్తులు



భక్తులతో రద్దీగా మారిన రాజన్న ఆలయ ప్రాంగణం

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి క్షేత్రం సోమవారం భక్త జనసంద్రంగా మారింది. వసంత పంచమిని పురస్కరించుకుని పరమశివుడి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం 3 గంటల నుంచే శివదీక్ష స్వాములు రాజన్న దర్శనం కోసం బారులు తీరారు. ఉదయం 4.30 గంటలనుంచి లోకల్ భక్తులు రాజన్నదర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరగా ఇతరప్రాంతాల నుంచి వేములవాడకు వచ్చిన భక్తులు ముందుగా కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకుని ధర్మగుండంలో పవిత్రస్నానాలను ఆచరించారు. ధర్మదర్శనం, కోడెమొక్కు క్యూలైన్‌లో భక్తులు సుమారు నాలుగు గంటల పాటు బారులు తీరారు. శీఘ్రదర్శనం, బ్రేక్‌దర్శనం ద్వారా భక్తులు ఆలయంలోకి చేరకున్నారు. రాజన్నకు అత్యంత ప్రీతి పాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలో పాల్గొని తరించారు. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి నేతృత్వంలో ఆలయ ఏఈవో అశోక్ సూపరింటెండెంట్ వరి సర్వయ్య, నరేందర్, రాజేందర్‌లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

మొదలైన శివదీక్షల స్వీకరణ..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలంలో శివదీక్షలు ప్రారంభమయ్యాయి. వసంత పంచమిని పురస్కరించుకుని శివభక్తులు సోమవారం తెల్లవారు జామున శ్రీరాజరాజేశ్వర స్వామి అభిషేక పూజలో పాల్గొని మాలాధారణ చేసుకునేందుకు తరలివచ్చారు. శివస్వాముల ఓం నమఃశివాయ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. ఆలయ అభిషేక మండపంలో ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో దాదాపు 300మంది శివభక్తులు మాలధారణ ధరించారు.

ప్రతియేటా శివరాత్రి ముందు శివుడికి మండల, అర్థ మండల దీక్ష మాలధారణ చేసి, శివరాత్రి రోజున లింగోద్భవ సమయంలో మాల విరమణ చేస్తారని ప్రధాన అర్చకులు ఈశ్వరగారి సురేష్, వాసలమర్రి గోపి, తమ్మల భీమన్న తెలిపారు.

రేపు రాజన్న హుండీ లెక్కింపు..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలోని హుండీలను బుధవారం లెక్కించనున్నట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. రాజన్న ఆలయంలోని ఓపెన్‌స్లాబ్‌లో అత్యంత భద్రత మధ్య ఉదయం 8 గంటల నుంచి హుండీలను లెక్కించనున్నట్లు పేర్కొన్నారు.



రాజన్న దర్శనం కోసం క్యూలో బారులు తీరిన భక్తులు



రాజన్న ఆలయంలో శివదీక్ష స్వీకరిస్తున్న భక్తులు

ప్రాజెక్టులు లేక వృథాగా నీరు

5వ పేజీ తరువాయి

ఎల్‌ఎండీలకు కూడా వరద నీరు బాగానే వస్తున్నది. మిడ్ మానేరు నుంచి మల్లన్న సాగర్, రంగనాయక సాగర్‌లకు నీటిని తరలిస్తున్నారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి వృథాగా పోయే నీళ్లలో కొన్ని నీళ్లను నిల్వ చేసేందుకు ధర్మారం మండలం పత్తిపాక వద్ద 10 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మించినట్లయితే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. తుమ్మడిహెట్టి వద్ద బ్యారేజీని కూడా సత్వరమే చేపట్టాలి. వర్షాకాలం పూర్తయిన తర్వాత కూడా ప్రాణహితకు వరద ఉంటుంది. ఆ నీరు ఎల్లంపల్లికి గ్రావిటీ ద్వారా వస్తుంటాయి. ఆ నీటిని అవసరాన్ని మిడ్ మానేరుకు తరలించినట్లయితే వేసవిలో నీటి కొరత ఉండదని నీటి రంగ నిపుణులు చెబుతున్నారు. అలాగే కాళేశ్వరం ప్రాజెక్టు అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను వచ్చే వర్షాకాలం నాటికి అందుబాటులోకి తీసుక వచ్చినట్లయితే, వాటిలో 18 టీఎంసీల వరకు నీటిని నిల్వ చేసుకునే అవకాశాం ఉంటుంది. అవసరాన్ని బట్టి మోటార్లను ఆన్ చేసి ఎల్లంపల్లిలోకి నీటిని ఎత్తిపోసుకుంటే వేసవిలో నీటి కొరత ఉండదని చెబుతున్నారు. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలని నీటి రంగ నిపుణులు అంటున్నారు.

రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీలలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

సుల్తానాబాద్, ఫిబ్రవరి 3: (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీలలో సుల్తానాబాద్ పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. హైదరాబాద్‌లో ఆదివారం విశ్వం ఎడ్యుకేట్, గామా ఆధ్వర్యంలో అబాకస్, వేదిక్ గణిత రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారు. సుల్తానాబాద్ నుంచి ముగ్గురు విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో మూడవ తరగతికి చెందిన కే మాన్‌వీక్ జూనియర్ విజువలైజేషన్ విభాగంలో ప్రథమ, రితన్య ఐదో తరగతి విద్యార్థిని సీనియర్ కేటగిరిలో ద్వితీయ బహుమతి సాధించారు. ఎం.సంచిత్ రెండవ తరగతి విద్యార్థి స్టార్ పర్ఫార్మర్ అవార్డ్ సాధించారు. విద్యార్థులకు బహుతులతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనబరచి జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్ ప్రిన్సిపాల్ క్రిష్ణప్రియ, పీడీ సత్యం అభినందించారు.

అక్షర శ్రీకారాలు.. పూజలు...


కృష్ణవేణి విద్యాసంస్థలో సామూహిక అక్షరాభ్యాసం, ట్రినిటీ పూజా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, మంథని ఆలయంలో చిన్నారులకు అక్షరాభాస్యం

వసంతపంచమి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలల్లో సామూహిక అక్షర శ్రీకారాలు చేయించారు. అలాగే పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. సరస్వతి విగ్రహానికి పూజలు నిర్వహించి చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రినిటీ ప్రైమరీ పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ డాక్టర్ దాసరి మమతారెడ్డి, పాఠశాల హెచ్‌ఎం కుమార్ పాల్గొనగా మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గాయత్రి పాఠశాలలో అక్షరాభ్యాసాలు, సాంప్రదాయ నృత్యాలను చేయించారు. గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లంకి శ్రీనివాస్, హెచ్‌ఎం రజనీదేవి పాల్గొన్నారు. సుభాష్ నగర్‌లోని సరస్వతి శిశుమందిర్‌లో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.

కోల్‌సిటీటౌన్, (ఆంధ్రజ్యోతి): అడ్డగుంటపల్లి కృష్ణవేణి విద్యాసంస్థలలో సరస్వతీ విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ మంజులాశ్రీనివాస్‌రెడ్డి హాజరై పూజలు చేశారు. వేదపండితులు సంతోష్‌శర్మ విద్యార్థులచే సామూహికంగా అక్షరాభ్యాసం నిర్వహించారు. రమేష్‌నగర్‌లోని ఉషోదయ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్ కొత్త శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, పోషకులు, విద్యార్థులు పాల్గొన్నారు. శారదానగర్‌లోని సరస్వతీ శిశుమందిర్‌లో హోమం నిర్వహించి చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేశారు. విద్యార్థుల భరతనాట్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పాఠశాల అధ్యక్షుడు బంక రామస్వామి, సమితి అధ్యక్షుడు డాక్టర్ భగవాన్‌రెడ్డి, కార్యదర్శి కొత్తకాపు సుధాకర్‌రెడ్డి, సహకార్యదర్శి బైస రఘుసింగ్, సావిత్రి, స్రవంతి, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): వసంత పంచమి పురస్కరించుకుని సుల్తానాబాద్‌లోని పలు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. వేణుగోపాలస్వామి, శివాలయం, వాసవి మాతా ఆలయం, లక్ష్మీ దేవాలయం తదితర ఆలయాల్లో అమ్మ వారికి అభిషేక పూజలు నిర్వహించారు. గాంధీనగర్‌లోని నేహా హైస్కూల్‌లో అక్షరాభ్యాసం చేయించి స్వీట్లు పంపిణీ చేశారు.

పాలకుర్తి, (ఆంధ్రజ్యోతి): జీడినగర్ ప్రాంతంలోని యూనివర్సల్ పాఠశాలలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ మహమ్మద్ ఇస్మాయిల్‌ప్రధానోపాధ్యాయులు సయ్యద్ అఫ్జల్ పాల్గొన్నారు. వేద పండితులు చిన్నారుల చేత అక్షరాభ్యాసం జరిపించారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి) : వసంత పంచమిలో భాగంగా భ్రమరాంబ మల్లికార్జునస్వామి క్షేత్రంతోపాటు గుంపులలోని రామభద్ర ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసాన్ని నిర్వహించారు. భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెద్దపల్లిరూరల్ (ఆంధ్రజ్యోతి) : నిమ్మనపల్లి పల్లవి మోడల్ స్కూల్‌లో సరస్వతి పూజ అనంతరం అర్చకులతో చిన్నారులకు ఆశీర్వచనం అందించి అక్షరాభ్యాసం చేయించారు. కరస్పాండెంట్ శోభరాణి, మల్లన్నతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాణి, ప్రగతి, కృష్ణవేణి టాలెంట్ పాఠశాలల్లో అక్షరాభ్యాస కార్యక్రమాన్ని చేపట్టారు. పాఠశాలల కరస్పాండెంట్, ఉపాధ్యాయులు, చిన్నారులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వసంత పంచమి వేడుకలను నాందిచారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 1992-1993 పదో తరగతి విద్యార్థులు ట్రస్ట్‌గా ఏర్పడి కార్యక్రమాలు చేస్తున్నారు. ఉన్నత పాఠశాలలో సరస్వతి మాతా విగ్రహానికి అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. గురువులను సన్మానించి పాదపూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నిరుపేదలైన చెంచు కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ బెల్లంకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ ట్రస్ట్‌గా ఏర్పడి పదేళ్ళగా సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఉపాధ్యక్షుడు కొల్లూరి హరిప్రసాద్, మాజీ జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, నాయకులు మాదాస్ సతీష్, కర్ణాకర్, ఇబ్రహీం, సాగర్, దేవయ్య, ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మంథని, (ఆంధ్రజ్యోతి): మంథనిలోని సరస్వతీ మాత ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. గోదావరి తీరంలోని బాల సరస్వతీ, అయ్యప్ప ఆలయ ఆవరణలోని జ్ఞాన సరస్వతీ, లక్ష్మీనారాయణస్వామి ఆలయాల తోపాటు సరస్వతీ శిశు మందిర్, కాకతీయ హైస్కూల్, కృష్ణవేణి హైస్కూల్‌లో అక్షరాబాస్యం చేయించారు. ప్రత్యేక హోమం నిర్వహించారు. అమ్మవారికి భక్తులు పసుపు, కుంకుమ, సారె, పూలు, గాజులు, సమర్పించారు. అమ్మవారిని బంగారు, వెండి ఆభరణాలతో ప్రత్యేక అలంకరించారు. భక్తులతో సరస్వతి మాత ఆలయాల్లో సందడి వాతావరణం నెలకొంది.

సంజీవరెడ్డి నియామకంపై హర్షం

సుల్తానాబాద్, ఫిబ్రవరి 3: (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా కర్రె సంజీవరెడ్డి నియామకంపై సుల్తానాబాద్‌కు చెందిన పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సంజీవరెడ్డికి జిల్లా అధ్యక్షపదవి లభించడం పట్ల నాయకులు కడారి అశోక్ రావు, సొదరి మహేందర్ యాదవ్, కొమ్ము తిరుపతి, చాతరాజు రమేష్, నాగుల మల్యాల తిరుపతి, రాజు, రాజేంద్ర ప్రసాద్, గుడ్ల వెంకటేష్, వేగోలం శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు.

కాల్వశ్రీరాంపూర్(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా కర్రె సంజీవరెడ్డి ఎంపికపై మండల కేంద్రంలో బీజేపీ నాయకులు స్వీట్లు పంపిణీ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు చిలువేరు సంపత్‌కుమార్, నాయకులు శంకర చారీ, ములుకోజు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు

కమాన్‌పూర్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కమాన్‌పూర్(గుండారం)ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీసీ కెమెరాలను సోమవారం ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ కాశీమల్ల సుధాకర్ తెలిపారు. పరీక్షల నిర్వహణకు ప్రయోగశాలలతో పాటు గదులలో సీసీ కెమరాలు ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. వార్షిక పరీక్షలను సీసీ కెమెరాల నిఘాలో నిర్వహిస్తామని పేర్కొన్నారు.

రిటైర్డ్ పీఈటీకి సన్మానం

ఎలిగేడు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు గ్యాజంగి సత్యనారాయణను సోమవారం వైస్ ఎంపీపీ బుర్ర వీరాస్వామిగౌడ్ సన్మానించారు. ఆయన మాట్లాడుతూ 31ఏళ్లు వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేసి ఇటీవల పదవి విరమణ పొందిన సత్యనారాయణ ఎందరో విద్యార్థులకు క్రీడలు నేర్పించారన్నారు. గుర్రం మల్లేశంగౌడ్, కేక్కర్ల చందుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంపన్నులకు దోచిపెట్టే విధంగా కేంద్ర బడ్జెట్

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సంపన్నులకు దోచిపెట్టే విధంగా ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి వై యాకయ్య ఆరోపించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను నిరసిస్తూ సోమవారం సీపీఎం కార్యాలయం నుంచి గోదావరిఖని మెయిన్ చౌరస్తా వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలకు, కార్మిక కర్షకులకు వ్యతిరేకంగా ఉందన్నారు. సామాన్యులను దోచి సంపన్నులకు పెట్టే విధంగా ఉందని, ఈ బడ్జెట్‌తో పేదలకు ఒరిగిందేమి లేదన్నారు. విద్య, వైద్యం, రైతు, కార్మిక సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించిందని, ప్రాధాన్యత రంగాలకు అధికంగా నిధులు కేటాయించలేదని, ఇది పూర్తిగా ప్రజా వ్యతిరేక బడ్జెట్ అన్నారు. బడ్జెట్‌లో విద్య, వైద్య రంగానికి పెద్దపీట వేయకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కుమారస్వామి, మహేశ్వరి, నాగమణి, నవీన్, భాస్కర్, అనూష, రజిత, అరుణ, మణెమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.


సుల్తానాబాద్‌లో నిరసన తెలుపుతున్న కార్మికులు, మంథనిలో బడ్జెట్ ప్రతుల దహనం

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను సవరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ఆందోళన చేశారు. రైస్ మిల్లుల ప్రాంతంలోని ఎస్సారెస్పీ కాలువ వద్ద కార్మికులు ప్ల కార్డులతో నిరసన వ్యక్తం చేశారు. జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యం రావు మాట్లాడుతు కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వార్షిక బడ్జెట్ కార్పొరేట్లకు అనుకూలంగా, కార్మిక వర్గానికి వ్యతిరేకంగా ఉందన్నారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర, కార్మికులకు కనీస వేతనం విషయాలు విస్మరించారన్నారు. ఇన్సూరెన్స్ రంగంలో వంద శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆహ్వానించడం దేశ ఆర్థిక వ్యవస్థకు నష్టం కలిగిస్తుందన్నారు. ప్రజా రైతు కార్మిక వ్యతిరేక బడ్జెట్‌ను వెంటనే సవరించాలని డిమాండ్ చేశారు. తాండ్ర అంజయ్య, రాజమల్లు, అబ్బాస్, కొమురయ్య, రాజేశం,అన్నపూర్ణ, రమ పాల్గొన్నారు.

మంథని, (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైతులు, విద్యార్థులు, వ్యవసాయ రంగానికి, బడుగు, బలహీన వర్గాల వారికి పూర్తిగా వ్యతిరేకంగా ఉందని ఆరోపిస్తూ అంబేద్కర్ చౌక్‌లో ప్రజా సంఘాల నేతలు బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బూడిద గణేష్, ఆర్ల సందీప్, తిరుపతి, గొర్రెకల సురేష్, మంథని లింగయ్యలు పాల్గొన్నారు.

వైభవంగా చెన్నకేశవస్వామి కల్యాణం


కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

పాలకుర్తి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): గుడిపెల్లి బోడగుట్టపై సోమవారం భూ-నీళాదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య వైభవంగా జరిగింది. పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. కల్యాణ మహోత్సవానికి ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్, మనాలి ఠాకూర్‌లు హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్డీఎఫ్‌సీ సీఎస్ఆర్ నిధులు రూ.10 లక్షలతో గుట్టపైకి సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తానని తెలిపారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా తాగు నీరు, విద్యుత్ దీపాలు, గుట్టపైకి రోడ్డు సౌకర్యం కల్పిస్తానని పేర్కొన్నారు. ఎస్ఐ స్వామి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేయ గా, వైద్య సిబ్బంది ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. భక్తులకు కసార్ల సత్యనారాయణ రెడ్డి దంపతులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. వసంత పంచమి నేపథ్యంలో శేఖర్‌రెడ్డి దంపతులు పిల్లలకు అక్షరాభ్యాసం చేయించి ఉచితంగా నోట్ పుస్తకాల పంపిణీ చేశారు. పుట్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం తిరుపతి, మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్ గౌడ్, గుడిపెల్లి మాజీ సర్పంచ్ కొప్పు పుష్పలత రాజేశం, మాజీ ఉపసర్పంచ్ రేశవేణి మల్లేశం, ఆలయకమిటీ సభ్యులున్నారు.

ఎమ్మెల్సీ కవితకు ఘన స్వాగతం

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు, ఎమ్మెల్సీ కవితకు పెద్దకల్వల వద్ద బీఆర్ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. నాయకులు పుష్పగుచ్ఛం అందించగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

పెద్దపల్లి, (ఆంధ్రజ్యోతి): దిక్సూచి స్వచ్ఛంద సంస్థ క్యాలెండర్‌ను ఎమ్మెల్సీ కవిత ఆవిష్కరించారు. టీఆర్ఎస్వీ నాయకుడు పడాల సతీష్ షాపును సందర్శించిన కవిత క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు బిజిగిరి నవీన్‌కుమార్, జాగృతి విద్యార్థి విభాగం రాష్ట్ర కన్వీనర్ పసుల చరణ్, రణధీర్ సింగ్ రాణా, సతీష్ గౌడ్, శ్రీరాం, బుర్ర శ్రీనివాస్, పాల రామారావు, పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయి


బాక్స్ క్రికెట్‌ను ప్రారంభించి క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. సోమవారం అడ్డగుంటపల్లిలో ఏర్పాటు చేసిన బాక్స్ క్రికెట్, వాలీబాల్ మైదానాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో బాక్స్ క్రికెట్ ఏర్పాటు చేయడం యువతకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. బాక్స్ క్రికెట్ తీసు కువచ్చి క్రీడాకారుల్లో ఉత్తేజాన్నినింపిన నిర్వాహకులు చిదురాల నాగరాజును అభినందించారు. వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, నాయకులు మహంకాళి స్వామి, పాతిపెల్లి ఎల్లయ్య, దూళికట్ట సతీష్, పొన్నం లక్ష్మణ్, పాల్గొన్నారు.

రామగుండం రిక్రియేషన్ క్లబ్ ఆవిర్భావం

జ్యోతినగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీలో రామగుండం రిక్రియేషన్ క్లబ్‌ను సోమవారం రాత్రి ప్రారంభించారు. కాజిపల్లిలోని ఫంక్షన్ హాలులో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ హాజరై ప్రారంభించారు. ప్రజల సంక్షేమం, మానసికోల్లాసానికి క్లబ్ పని చేయాలన్నారు. రామగుండం అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నానని తెలిపారు. రిక్రియేషన్ క్లబ్ సమకూర్చిన సైకిళ్లను 8వ తరగతి చదువుతున్న పలువురు ప్రభుత్వ పాఠశాలల బాలికలకు పంపిణీ చేశారు. స్టడీ మెటీరియల్, బ్యాగు, ప్యాకెట్ మనీని 10 తరగతి విద్యార్థులకు అందజేశారు. రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షుడు బల్మూరి అమరేందర్‌రావు, మంతెన శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పుప్పాల విక్రమసింహారావు, జెఏస్ చెరుకు బుచ్చిరెడ్డి, కోశాధికారి అశోక్‌రావు, నిట్టూరి జీవన్‌బాబు, చందుపట్ల తిరుపతిరెడ్డి, రాధాకృష్ణ, పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా స్వామి

జూలపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కుమ్మరికుంట గ్రామానికి చెందిన ఎక్కిరాల స్వామిని మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు మంథని చందు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్వామిని కాంగ్రెస్ పార్టీ యువనాయకులు పెర్క స్యామ్‌తో పాటు పలువురు సన్మానించారు. స్వామి మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన మాదిగదండోరా సోదరులకు కృతజ్ఞతలు తెలిపాడు. నాయకులు చిలుక ఆనంద్, ఎక్కిరాల రాజు, కొంకటి లక్ష్మన్, వడ్లూరి అంజయ్య, కొంకటి సురేందర్, రాకేష్, రంజిత్ పాల్గొన్నారు.

కోర్టుకు శాశ్వత భవనం నిర్మించండి

ధర్మారం ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కోర్టుకు శాస్వత భవనం నిర్మించి, మౌలిక వసతులు కల్పించాలని పెద్దపల్లి జిల్లా ఫోర్ట్ పోలియో హైకోర్టు న్యాయమూర్తి సి.విజయ భాస్కర్‌రెడ్డిని మేడారం కోర్టు న్యాయవాదులు సోమవారం కలిశారు. కోర్టు పరిధిని పెంచుతూ శాశ్వత న్యాయమూర్తితో పాటు ఏజీపీ, ఏపీపీ ల నియామకం చేపట్టాలని వారు కోరారు. వారి విన్నపానికి హైకోర్టు న్యాయమూర్తి సానుకూలంగా స్పందించారని న్యాయవాదులు నార అశోక్‌రెడ్డి, బొట్ల లక్ష్మినర్సయ్య, నూనె సత్యనారాయణలు తెలిపారు. హైకోర్టు న్యాయమూర్తిని సన్మానించారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కమాన్‌పూర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): యువత విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై కొట్టే ప్రసాద్ అన్నారు. సోమవారం గుండారంలో పోలీస్ కళాకారులచే మూఢనమ్మకాలు, సైబర్‌క్రైమ్, గంజాయిలపై కళాకారులు వివరించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఏదైన గ్రామాలకు వెళ్తే తమ ఇండ్లకు నూతన టెక్నాలజీ గల సైరన్ తాళాలు వేసుకోవాలని సూచించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఓటీపీలు చెప్ప వద్దన్నారు. రానున్న ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని, ఏదైన గొడవలు సృష్టిస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ తప్పకుండా చేయించుకోవాలన్నారు. హెడ్‌కానిస్టేబుల్ బాపన్న, వంశీకృష్ణ, కళాకారులు శ్రీనివాస్, భద్రయ్య, సదయ్య పాల్గొన్నారు.



భద్రకాళి ఆలయ వార్షికోత్సవం


వసంత పంచమి సందర్భంగా ప్రత్యేక పూజల్లో జీఎం దంపతులు

రామగిరి/యైటింక్లయిన్ కాలనీ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): వసంత పంచమి సందర్భంగా ఓసీపీ-1,2లలోని భద్రకాళి ఆలయంలో ఆలయ వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో చండీ హోమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సముద్రాల విజయసారథి, తిరుమల వాసుదేవచార్యులు, కాసార్ల శ్రీనివాసచారి వేదపండితుల మంత్రోచ్ఛరణ మధ్య పూజలు జరిపారు. జీఎం సుధాకర్‌రావు దంపతులు, ప్రాజెక్టు అధికారి జంగిటి రాజశేఖర్ దంపతులు ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు. గని మేనేజర్ ఉదయ్‌హరిజన్, అధికారులు పేరాల శ్రీనివాసరావు, కిషన్, నాయకులు కొటరవీందర్‌రెడ్డి, గడ్డం తిరుపతియాదవ్, తిరుపతిరావు, వెంకటస్వామి గౌడ్, కొలిపాకసారయ్య, మల్లారెడ్డి, శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు మెరుగైన వేతనాలు

రామగిరి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేసే కాంట్రాక్టు కార్మికులకు మెరుగైన వేతనాల పై మరో మూడు నెలల్లో తీపి కబురు వింటారని మినిమం వేజ్‌బోర్డు కమిటీ నాయకుడు నరసింహారెడ్డి అన్నారు. సోమవారం ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని సెంటినరీకాలనీ ఐఎన్‌టీయుసి కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికుల సంఘం ఇన్‌చార్జి ఉడుత శంకర్‌యాదవ్, జెండర్ సెక్రటరీ బండ కిరణ్‌రెడ్డిలు నరసింహారెడ్డి శాలువతో ఘనంగా సత్కారించారు. కాంట్రాక్టు కార్మికుల తరుపున ధన్యవాదాలు తెలిపారు. ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు కొటరవీందర్‌రెడ్డి, నాయకులు రామారావు, కిషన్ పాల్గొన్నారు.

మహిళా కార్మికులకు వాష్ రూమ్స్ ఏర్పాటు చేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

గోదావరిఖని, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): భూగర్భ గనుల్లో పని చేసే మహిళా కార్మికులకు వాష్ రూమ్ సౌకర్యం కల్పించాలని హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మహిళా కార్మికులు వాష్ రూమ్‌లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, భూగర్భ గనుల్లో స్కావెంజర్లను నియమించాలని, భూగర్భ గనుల్లో, ఓసీపీల్లో కాలం చెల్లిన యంత్రాలతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాటి స్థానంలో కొత్త యంత్రాలను ప్రవేశపెట్టాలని, సర్ఫేస్‌లో ఉన్న ఖాళీలను సీనియార్టీ ప్రకారం భర్తీ చేయాలని, డిప్యూటేషన్ దందాను బంద్ చేయాలన్నారు. రెఫరల్‌పై ఆసుపత్రులకు వెళ్లిన కార్మికుల వద్ద నుంచి టెస్టుల పేరు మీద డబ్బులు వసూలు చేస్తున్నారని, ఖర్చులను సింగరేణి యాజమాన్యమే భరించాలని, కార్మికులకు భోజన సౌకర్యం కల్పించాలని సూచించారు. భూగర్భ గనుల నుంచి సర్ఫేస్‌కు వచ్చిన కార్మికులకు పే ప్రొటక్షన్, క్యాటగిరి ప్రొటక్షన్ కల్పించాలని, జీడీకే ఓసీపీ-5లో గెలిచిన సంఘాలు కార్మికులకు తప్పుడు సమాచారం ఇచ్చి సంతకాలు చేయించారని, 110మంది కార్మికులకు యాజమాన్యం ఇచ్చిన వార్నింగ్ లెటర్లను వెంటనే వాపసు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఖయ్యూం, పల్లె క్రాంతి, దొబ్బేటి సతీష్, సహదేవ్, రాంమోహన్, కిరణ్, రాంచందర్ పాల్గొన్నారు.

ఆర్‌జీ-1 ఏరియా కమిటీ ఎన్నిక

హెచ్‌ఎంఎస్ ఆర్‌జీ-1 ఏరియా నూతన బ్రాంచ్ కమిటీని ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ ప్రకటించారు. వైస్ ప్రెసిడెంట్‌గా ఎంఏ ఖయ్యూం, సెక్రటరీగా పల్లె క్రాంతి, కోశాధికారిగా దుర్గం శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా దొబ్బేటి సతీష్, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా కొమురయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా సహదేవ్, రాజేష్, శ్రీనివాస్, హబీబ్‌ఖాన్, స్వామితో పాటు 43మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

5 దేశ వ్యాప్త నిరసనలను విజయవంతం చేయాలి


ప్లకార్డులను ప్రదర్శిస్తున్న సీఐటీయూ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 5న సీఐటీయూ ఆధ్వర్యంలో తలపెట్టిన దేశవ్యాప్త నిరసనలను విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా కమిటీ సభ్యుడు ఉల్లి మొగిలి పిలుపునిచ్చారు. సోమవారం ఓసీపీ-3 కృషిభవన్‌లో డిమాండ్లతో కూడిన ప్లకార్డులతో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులకు పెంచాలని, పట్టణ ప్రాంతాలకు విస్తరించాలని, కార్మికుల కనీస వేతనం రూ. 26వేలుగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసనలు చేపట్టనున్నట్టు తెలిపారు. పిట్ సెక్రెటరీ సారంగం, నాయకులు లక్ష్మీరాజం, వెంకటనర్సయ్య, వెంకటయ్య, ఎస్ రాజన్నతో పాటు కార్మికులు పాల్గొన్నారు.

వీకేపీ గని సమస్యలు పరిష్కరిస్తాం

వకీల్‌పల్లె గని సమస్యలను పరిష్కరిస్తామని ఐఎన్‌టీయూసీ ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ శంకర్‌నాయక్ తెలిపారు. సోమవారం గనిని ఐఎన్‌టీయూసీ బృందం సందర్శించి కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో సింగరేణి అభివృద్ధితో పాటు కార్మిక సమస్యల పరిష్కారం దిశగా ఐఎన్‌టీయూసీ కృషి చేస్తుందని పేర్కొన్నారు. పిట్ సెక్రెటరీ జగదీష్, సెంట్రల్ జాయింట్ సెక్రెటరీ దశరథం, సంపత్‌రెడ్డి, బ్రాంచి సెక్రెటరీ రవీందర్, నాయకులు పాల్గొన్నారు.